క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

ముధోల్: మరమ్మతుల నేపథ్యంలో మండల కేంద్రంలో ఆదివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఏడీ లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

19న తైబజార్ వేలం

ఖానాపూర్: పట్టణంలోని తైబజార్‌కు ఈనెల 19న మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ మనోహర్ తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో ప్రతి బుధ, ఆదివారాల్లో నిర్వహించే వారసంతతోపాటు రోజువారీ సంతలో జరిగే క్రయవిక్రయాలపై వ్యాపారులు, నిర్వాహకుల నుంచి పన్నుల వసూళ్లు చేసేందుకు ఈతైబజార్ నిర్వహిస్తారన్నారు. ఆసక్తి కల్గినవారు ఈనెల 18న రూ.రెండు లక్షల డీడీ తీసి పనివేళల్లో కార్యాలయంలో అందించాలన్నారు. పూర్తి వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

జాఫ్రపూర్‌లో వైద్యశిబిరం



పరీక్షిస్తున్న వైద్యులు శ్రీనివాస్

సోన్: మండలంలోని జాఫ్రపూర్‌లో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఎంపీపీ మానసరెడ్డి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన శిబిరంలో వైద్యులు శ్రీనివాస్ పలువురికి వైద్యపరీక్షలు చేశారు. విషజ్వరాలు ప్రబలుతుండటంతో ఇంటింటికీ వెళ్లి జ్వర పీడితుల రక్తనమూనాలు సేకరించారు. అవసరమైన వారికి మందులు అందించారు. హరీశ్‌రెడ్డి, సాయన్న, భూమారెడ్డి, రాజురెడ్డి పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

ఖానాపూర్: మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై జి.లింబాద్రి అన్నారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్‌నగర్ శివారులో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేశారు. వాహనదారులు అన్ని ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవడంతోపాటు సీటు బెల్టు, హెల్మెట్ ధరించాలని కోరారు.

‘ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అప్రజాస్వామికం’



మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అప్రజాస్వామికమని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు టి.రాజగంగన్న అన్నారు. శనివారం పట్టణంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఐటీ, ఈడీ, సీబీఐ వంటి సంస్థలతో ప్రతిపక్షాలను అణచివేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని.. దీనిని తాము ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జి.రాజు, ఖలీల్, రవికుమార్, నరేశ్, రఘు, అజయ్ తదితరులు ఉన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ

సోన్: మండలంలోని న్యూవెల్మల్‌బొప్పారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ కార్యవర్గం ఎన్నికను ప్రధానోపాధ్యాయుడు నాలం విద్యాసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌గా జక్కని రేఖ, కన్వీనర్‌గా ప్రధానోపాధ్యాయుడు నాలం విద్యాసాగర్‌ను ఎన్నుకున్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి చదివే విద్యార్థుల తల్లిదండ్రులు సభ్యులుగా ఉంటారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్‌ఎంసీ స్థానంలో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం పోషకుల సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం



పారాయణంలో భక్తులు

నిర్మల్: జిల్లాకేంద్రంలోని బుధవార్‌పేట్ ఆంజనేయ మందిరం(నంబర్–4)లో శనివారం రాత్రి హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. భక్తిభావం పెంచడంతోపాటు ముందుతరాలకు మనదైన సంస్కృతిని అందించాలనే లక్ష్యంతో ప్రతీ శనివారం హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో ఆలయ కమిటీ అధ్యక్షుడు గంట రాకేశ్, కోశాధికారి ఆదుముల్ల శ్రీనివాస్, కార్యదర్శి దొనగిరి మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణాలు ఇలా.. ఆడేదెలా?

- గ్రామాల్లో నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు
- ఆటపరికరాల్లేక కన్నెత్తి చూడని క్రీడాకారులు



రాజుతండా పాఠశాలలో క్రీడాప్రాంగణం



అలంకారప్రాయంగా గన్నోరాలోని క్రీడా ప్రాంగణం

ముధోల్: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం రెండేళ్ల కిందట ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. ఒక్కో ప్రాంగణానికి ఎకరం స్థలం కేటాయించి.. రూ.ఐదు లక్షల చొప్పున నిధులు వెచ్చించారు. ప్రభుత్వ స్థలం దొరకని మరికొన్ని గ్రామాల్లో అర ఎకరం కేటాయించి.. రూ.2.50లక్షలు వెచ్చించారు. కానీ అవసరమైన క్రీడా సామగ్రి ఏర్పాటు చేయలేదు. మరోవైపు గ్రామాల్లో ప్రాంగణం ఎంపికకు అనువైన ప్రదేశం ఎంచుకోకపోవడంతో అటువైపు వెళ్లేందుకు క్రీడాకారులు విముఖత చూపుతున్నారు. దీంతో క్రీడా ప్రాంగణాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. నిర్వహణ లేక ప్రాంగణాలు మందుబాబులకు అడ్డాగా మారాయి.

ముధోల్ మండలంలో..

ముధోల్ మండలంలోని 19 గ్రామపంచాయతీల్లో 19 క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో స్థలం లేక పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. చాలా చోట్ల ఆటవస్తువులు అందించలేదు. కేవలం ప్రాంగణాల పేరిట బోర్డులు మాత్రమే ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్నారు. మరికొన్ని ప్రాంగణాలను గ్రామశివారులో, వ్యవసాయ క్షేత్రాల్లో ఏర్పాటు చేయడంతో అక్కడకు వెళ్లేందుకు క్రీడాకారులు ఆసక్తి చూపడం లేదు. దీంతో రైతులు తమ పంట దిగుబడులను ప్రాంగణాల్లో ఆరబోసుకుంటున్నారు. పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో మైదానాలు అలంకార ప్రాయంగా మారాయి. తాగి పడేసిన మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి.

క్రీడా ప్రాంగణంలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, లాంగ్‌జంప్ కోర్టులు ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. పట్టించుకోలేదు. మైదానాల చుట్టూ నీడనిచ్చే మొక్కలు నాటలేదు. క్రీడల కోసం పాతిపెట్టిన పరికరాలు తుప్పుబడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలను శుభ్రం చేయడంతోపాటు ఆట పరికరాలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆటలకు దూరమవుతున్నాం



మైదానంలో క్రీడా సామగ్రి లేకపోవడంతో ఆటలకు దూరమవుతున్నాం. ప్రభుత్వం క్రీడలపై నిర్లక్ష్యం వీడి మైదానాల్లో ఆట పరికరాలు ఏ ర్పా టు చేస్తే క్రీడాకారులకు మేలు జరుగుతుంది. అధికారులు స్పందించి క్రీడా సామగ్రి అందుబాటులో ఉంచాలి. – భోజేందర్, గన్నోరా

స్కూల్‌లోనే ఏర్పాటు చేశారు



మా గ్రామంలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో స్కూల్‌లోనే క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటివరకు సామగ్రి అందించలేదు. అధికారులు స్పందించి క్రీడాకారుల కోసం క్రీడాసామగ్రి సరఫరా చేయాలి. – సాయినాథ్, రాజుతండా

ఉన్నతాధికారులకు విన్నవించాం

గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలకు సామగ్రి సరఫరా కాలేదు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రభుత్వం నుంచి క్రీడా సామగ్రి రాగానే మైదానంలో ఏర్పాటు చేస్తాం. ప్రతి ఒక్కరూ మైదానాలను ఉపయోగించుకోవాలి. – రాములునాయక్, ఎంపీడీవో

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

భైంసా: గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ అన్నారు. శనివారం బాసరలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. పాత గ్రామపంచాయతీ సమీపంలో రూ.15 లక్షలతో నిర్మించే అంగన్‌వాడీ భవన నిర్మాణానికి, జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో రూ.13.50లక్షలతో నిర్మించే సైన్స్‌ల్యాబ్ గది నిర్మాణానికి, బస్టాండ్ వద్ద రూ.ఐదు లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు, వేద పాఠశాల వద్ద రూ.ఐదు లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైయినేజీల నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో సాగు, తాగునీటిపై దృష్టి సారిస్తానన్నారు. సమస్యలుంటే నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. వారి వెంట పలువురు నాయకులు ఉన్నారు.

సారంగపూర్ తొలి ఎంపీపీ మృతి



హేమలత (ఫైల్)

నిర్మల్: సారంగాపూర్ మండలానికి తొలి ఎంపీపీ, మండలంలోని జౌళి గ్రామానికి చెందిన హేమలత లక్ష్మారెడ్డి(87) శుక్రవారం అనారోగ్యంతో తన నివాసంలో మృతి చెందారు. 1987 నుంచి 1992 వరకు ఈమె ఎంపీపీగా పనిచేశారు. 1956లో పంచాయతీరాజ్ వ్యవస్థ అమల్లోకి వచ్చిన అనంతరం నిర్మల్ నియోజకవర్గంలో ఏకగ్రీవంగా ఎన్నికైన తొలి మహిళా ఎంపీపీ వీరే. అప్పట్లో మహిళలు ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడానికే జంకే సమయంలో హేమలత మండల రాజకీయ వ్యవస్థను శాసించే స్థాయి చేరుకోగలిగారని మండల ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. జౌళి గ్రామంలో నిర్వహించే హేమలత అంత్యక్రియలకు మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హాజరు కానున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మాధవరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



పెంబి : పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

కడెం: రాష్ట్ర ప్రభుత్వం రైతులసంక్షేమానికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని లింగాపూర్ గ్రామంలో పాండ్వాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో గోదాం నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం మద్దిపడగలో పశువుల ఆసుపత్రి భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇందులో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశ్, మాజీ మండలాధ్యక్షుడు వెంకటేశ్, రమేశ్‌రావు, చుంచు వెంకన్న, దుర్గె వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

కల్వర్టు పనులకు భూమిపూజ

పెంబి: మండల కేంద్రంలో ఉపాధి నిధులు రూ.10లక్షలతో నిర్మించే కల్వర్టు పనులకు శనివారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ సత్యం, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు స్వప్నీల్ రెడ్డి, ఏపీవో రాజశేఖర్, ఎఫ్‌ఏలు, నాయకులు రాజన్న, శంకర్, భూమేశ్, మహేందర్, రాజలింగు ఉన్నారు.

‘పది’ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కుంటాల: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఎ.రాజేశ్వర్, డీవోఆర్ రాజేశ్వర్ పేర్కొన్నారు. ఈ కేంద్రంలో ఓలా, లింబా(కే), కుంటాల, నర్సాపూర్(జి)మండలంలోని గొల్లమాడ ఉన్నత పాఠశాలలకు చెందిన 197 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వెల్లడించారు. పరీక్ష కేంద్రం వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్సై రజనీకాంత్ తెలిపారు.



లోకేశ్వరంలో నంబర్లు వేస్తున్న అధికారులు

లోకేశ్వరం: ఈనెల 18 నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు లోకేశ్వరం జెడ్పీ పాఠశాల డీవో రతన్‌కుమార్ కులకర్ణి, చీఫ్ సూపరిటెండెంట్ రమణారెడ్డి అన్నారు. శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో హాల్‌టికెట్ నంబర్లు వేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో 118 మంది, జెడ్పీ పాఠశాలలో 152 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. జూనియర్ కళాశాలలో 8 మంది ఇన్విజిలేటర్లు, జెడ్పీ పాఠశాలలో 12 మంది ఇన్విజిలేటర్లు, ఇద్దరు డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి

భైంసాటౌన్: పదో తరగతి విద్యార్థులు బాగా చదివి ఉన్నతంగా రాణించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు, ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్‌రావు పటేల్ అన్నారు. శనివారం పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేశారు. గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ఏపీనగర్‌లోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు ప్యాడ్లు అందజేశారు.

తానూరు: మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం ఉపాధ్యాయులు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్ విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. ఉపాధ్యాయులు భూమన్నయాదవ్, ఉపాధ్యాయురాలు గంగారాణి తదితరులు ఉన్నారు.

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు కొతమిర రమేశ్ పరీక్షప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరసింహాచార్యులు తదితరులు ఉన్నారు.

‘నగేశ్ గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలి’

ముధోల్: బీజేపీ తరపున ఆదిలాబాద్ ఎంపీగా పోటీ చేసే గొడం నగేశ్ గెలుపునకు కృషి చేయాలని బీజేపీ లాబర్తి మండల కన్వీనర్ తాటివార్ రమేశ్ అన్నారు. లార్తి సంపర్క్ అభియాన్‌లో భాగంగా ముధోల్‌లో మండల స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకూ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలని పేర్కొన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు పోతన్న, మాజీ ఉపసర్పంచ్ దశరథ్, పోతన్న, శ్రీనివాస్, సాయి, భూషణ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

లోకేశ్వరం: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బూత్ స్థాయి నుంచి కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి అన్నారు. శనివారం లోకేశ్వరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిన సోనియమ్మకు ఆదిలాబాద్ ఎంపీ సీటును గెలిచి బహుమతిగా అందిస్తామన్నారు. దశల వారీగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పండరిగౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ షఫీ, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, నరేశ్, సుధీర్‌రెడ్డి, మహిపాల్, లక్ష్మణ్, రాజేశ్వర్, సంతోష్‌రెడ్డి ఉన్నారు.

ఎస్సైకి సన్మానం

లోకేశ్వరం: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్సై రాజును శనివారం పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సురేశ్‌రావు, ప్రధాన కార్యదర్శి రాజారాం సన్మానించారు. పీఆర్టీయూ నాయకులు రాజేందర్, అశోక్, దేవేందర్‌రెడ్డి, వినోద్, దేవన్న, నవీన్, కోటేశ్వర్‌రావు, భూమేశ్, మురళీధర్, మోహన్‌రావు, వెంకటరమణ, నరేందర్‌రెడ్డి ఉన్నారు.

బ్లాస్టింగ్ పనులతో బెంబేలు

ఖానాపూర్: పట్టణంలోని అంబేద్కర్ నగర్ శివారు నుంచి దిలావర్‌పూర్ వెళ్లే మార్గంలో రెంకోని వాగుపై వంతెన నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో వంతెనపై ఉన్న పాత పిల్లర్లతోపాటు మధ్యలో వచ్చిన బండలను పగులగొట్టేందుకు కాంట్రాక్టర్ బాంబు బ్లాస్టింగ్ చేస్తున్నారు. బాంబ్ బ్లాస్టింగ్ సమయంలో రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులను కొద్దిసేపు నిలిపి ఉంచుతున్నారు. ఈ బ్లాస్టింగ్ శబ్దాలకు ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

సంక్షిప్త వార్తలు

కంటిపరీక్షలు

పెంబి: మండలంలోని మందపల్లి గ్రామంలో లయన్స్‌క్లబ్, ఆదిత్య వికాస్ కంటి ఆసుపత్రి ఖానాపూర్ ఆధ్వర్యంలో శనివారం 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 25మందికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నట్లు డాక్టర్ సన్నీత్ కుమార్ తెలిపారు. వైస్ ఎంపీపీ గంగారెడ్డి, పెంబి లయన్స్ క్లబ్ సెక్రెటరీ వెంకన్న, చంద్రశేఖర్, రాజన్న, సిబ్బంది ప్రసాద్, శ్రావణి ఉన్నారు.

పారిశుధ్య చర్యలు

ఖానాపూర్: పట్టణంలోని ప్రధాన రహదారిపై పేరుకుపోయిన దుమ్ము ధూళిని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం ఆధ్వర్యంలో గాలిపంపు మోటారు ద్వారా శనివారం శుభ్రం చేయించారు. దుమ్ముధూళితో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు, వ్యాపారులు విన్నవించగా చర్యలు చేపట్టినట్లు చైర్మన్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి చైర్మన్‌ను బాదనకుర్తికి చెందిన కాంగ్రెస్ నాయకులు మహేశ్, హరిప్రసాద్, సంతోష్‌లు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కమిషనర్ మనోహర్, కౌన్సిలర్ శంకర్ ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కుభీర్: మండలంలోని జామ్‌గాం గ్రామంలో శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో ఉపాధి నిధులు రూ.మూడు లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు బషీర్, ప్రధాన కార్యదర్శి బంక బాబు, సాయిబాబా పటేల్, యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షులు లవకుశ్, అబ్దుల్ వాహెద్, విలాస్, దేవేందర్, మల్లేశ్ పాల్గొన్నారు.

మందిరం నిర్మాణానికి భూమిపూజ

కుభీర్: మండల కేంద్రంలోని ఏసీసీ కాలనీలో పురాతన గంగమ్మ ఆలయం స్థానంలో నూతనంగా నిర్మించే ఆలయ పనులను శనివారం ప్రారంభించారు. ఈ మందిరాన్ని సొంత డబ్బులతో ఎడ్ల మల్లన్న నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో విశ్వంబర్ మహరాజ్, కాలనీ సంఘం అధ్యక్షులు సంతోష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

కడెం: మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1996–97లో ఐదో తరగతి చదివిన వారంతా శనివారం పాఠశాలలో సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకొని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు చదువు చెప్పిన గురువులను సత్కరించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో శనివారం రూ.ఐదు లక్షలతో నిర్మించే కల్వర్టు, డ్రైయినేజీ పనులకు జెడ్పీటీసీ రాజేశ్వర్, కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజేశ్వర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్, అట్ల రాంరెడ్డి, రవి కిరణ్, నారాయణ, సమ్మెట రవి, సిరిపురం నగేశ్, సురేశ్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభించిన ఎంపీపీ

లోకేశ్వరం: మండలంలోని మన్మద్‌లో ఉపాధి నిధులు రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను శనివారం ఎంపీపీ లలిత ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, బీఆర్ఎస్ కన్వీనర్ శ్యాంసుందర్, భోజన్న, శేఖర్‌రెడ్డి, సాయన్న, మహేందర్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

కుంటాల: సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీ విశారద పేర్కొన్నా రు. పోషణ్ పక్వాడాలో భాగంగా శనివారం మండలంలోని లింబా(కే) అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం గిరినాథ్, అంగన్‌వాడీ టీ చ ర్లు సువర్ణ, సత్తమ్మ, తదితరులున్నారు.

‘కార్మికుల తొలగింపుపై విచారణ చేయాలి’



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి రాధ

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్‌లోని ప్ర భుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికుల తొలగింపు ఘటనపై ఎంఈవో, డీఈవో విచారణ చేపట్టాలని మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధ అన్నారు. శనివారం పట్టణంలోని పాఠశాలలో విలేకరులతో మాట్లాడారు. 20ఏళ్లుగా పాఠశాలలో పని చేస్తున్న వారిని తొలగించడంపై పలు వివరాలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండలాధ్యక్షురాలు లక్ష్మి, విజయ, మంజుల, నర్సవ్వ, అనసూయ, సుభద్ర, చిన్నమ్మ, రుకుంబాయి ఉన్నారు.

18 నుంచి జీవాలకు టీకాల పంపిణీ

ఖానాపూర్: పట్టణంలో ఈనెల 18 నుంచి ఏప్రిల్ 3 వరకు పశువులకు అందించే గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ ఏడీ రామచంద్రుడు అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 18 నుంచి 20 వరకు విద్యానగర్‌లో శిబిరం ఉంటుందన్నారు. 21న గాంధీనగర్, 22న ఇంద్రానగర్, 23న శివాజీనగర్, 26న అంబేద్కర్‌నగర్, 27న సాయినగర్, 28న శ్రీరాంనగర్, ఏప్రిల్ 3న శాంతినగర్‌లో జరిగే శిబిరానికి రైతులు పశువులను తీసుకొచ్చి టీకాలను వేయించుకోవాలని సూచించారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం



భైంసాలో కేసు పరిష్కరిస్తున్న జడ్జి దేవేంద్రబాబు

భైంసాటౌన్: కేసుల సత్వర పరిష్కారానికి జా తీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని భైంసా ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి డి.దేవేంద్రబాబు అన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా 1154 కేసులను పరిష్కరించారు. సీసీ కాంప్రమైజ్ 48, సీసీ అడ్మిషన్ 42, ఎస్‌టీసీ ఐపీసీ 03, ఎస్‌టీసీ గేమింగ్ యాక్ట్ 03, డ్రంకెన్‌డ్రైవ్ 1,055, మొత్తం 1,154 కేసులు పరిష్కరించారు.

లోక్ అదాలత్‌లో 1,916 కేసులు పరిష్కారం

నిర్మల్‌చైన్‌గేట్:జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 1,916 కేసులు పరిష్కారమయ్యాయి. జిల్లా కోర్టులో అదాలత్‌ను జిల్లాజడ్జి కర్ణకుమార్ ప్రారంభించారు. సివిల్ కేసులు 9, క్రిమినల్ కేసులు 1,809, ప్రీ లిటికేషన్ కేసులు 98 పరిష్కారమయ్యాయని వీటి ద్వారా రూ 55,28,600 జరిమానా విధించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ అజేష్‌కుమార్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి భవిష్య పాల్గొన్నారు.

సరస్వతీమాత విగ్రహం ఏర్పాటు



విగ్రహం వద్ద నర్సయ్య దంపతులు, తదితరులు

లక్ష్మణచాంద: తాను పని చేసిన మండలంలోని పీచర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సరస్వతీమాత విగ్రహం ఏర్పాటు చేశారు పీజీ హెచ్‌ఎం మిట్టపల్లి నర్సయ్య. గతంలో ఆయన పీచర ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడిగా పని చేసి ఇటీవల పదోన్నతి పొంది పీజీ హెచ్‌ఎంగా వెళ్లారు. రూ.48వేలతో తయారు చేయించిన సరస్వతీమాత విగ్రహం, ప్రతిష్ఠాపన గద్దె, దాని చుట్టూ ఇనుప వలయం కోసం మొత్తం రూ.లక్ష వరకు వెచ్చించారు. శనివారం పాఠశాలలో సరస్వతీమాత విగ్రహాన్ని ఆవిష్కరించారు. నర్సయ్య దంపతులు, ఎంపీటీసీ రాజేశ్వర్, వీడీసీ నాయకులు భూమేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



హోమం జరిపిస్తున్న పండితులు

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి గ్రామంలో శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆ ల య వార్షికోత్సవంలో భాగంగా శనివారం జాతర నిర్వహించారు. పండితులు రాజశేఖర్‌శాస్త్రి, సతీశ్‌కుమారచారి బృందం ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, బిల్వపత్ర అర్చనలు, గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురారోపణ, అఖండ స్థాపన, రుత్విక్ వరణం, మండపారాధన తదితర పూజలు చేశారు. అనంతరం శివపార్వతుల కల్యాణం, రుద్రహవనం, పూర్ణాహుతి, అన్నదానం నిర్వహించారు. జాతరకు సమీప గ్రామాల ప్రజలు తరలివచ్చారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ రాణి, శ్రావణ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.